సాక్షి
నంద్యాల
బుధవారం ၊ 26 ၊ జూలై ၊ 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ లవన్న, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



బంగారం ఆశ చూపి ..

తక్కువ ధరకు కేజీలలో బంగారాన్ని ఇస్తామంటూ కర్ణాటకకు చెందిన ముఠా నంద్యాల జిల్లాలో పలువురిని నిలువునా మోసం చేసింది. నకిలీ బంగారంతో బురిడీ కొట్టించి రూ. లక్షలు దోచుకుంది. 8లో..



ఫార్మసిస్ట్ మందుల వ్యాపారం

నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలలో కాంట్రాక్ట్ ఫార్మసిస్టు హోమియోపతి మందులు రోగులకు విక్రయిస్తున్నాడు. ఫార్మసిస్ట్‌పై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. 8లో..

న్యూస్‌రీల్

ఆశాజనకంగా వర్షాలు

నంద్యాల(సెంట్రల్): జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా వర్షపాతం 3.1 మి.మీగా నమోదు కాగా, మంగళవారం ఏకంగా 16.1 మి.మీల నమోదైంది. అత్యధికంగా పాములపాడులో 39.6 మి.మీ, అత్యల్పంగా సంజామల 4.4 మి.మీల వర్షపాతం నమోదైంది. నందికొట్కూరు 32.4, జూపాడుబంగ్లా 32.2, ఆత్మకూరు 31.2, పగిడ్యాల 30.4, వెలుగోడు 28.8, కొత్తపల్లె 25.2, గడివేముల 21.4, మహానంది 17.8, మిడ్తూరు 16.2, బేతంచెర్ల 15.2 మి.మీ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

డిప్లొమా పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: కర్నూలు ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాలలో మంగళవారం రెండు సంవత్సరాల డిప్లొమా కోర్సు థియరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గాత్రం కోర్సుకు 8, కూచిపూడి నృత్యంకు 5, నాదస్వరంకు 4, వయెలిన్‌కు 2, డోలుకు 2 మొత్తం 21 మంది విద్యార్థులు హాజరయ్యారు. థియరీ పరీక్షల అనంతరం నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్, రెండు సంవత్సరాల డిప్లమా కోర్సులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ తెలిపారు.

బీఎడ్ ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన బీఎడ్ 3వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఏప్రిల్ 2023 పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. బీఎడ్ 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 1922 మంది విద్యార్థులు హాజరవ్వగా 1604 మంది పాసయ్యారు. 3వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 546 మంది హాజరవ్వగా 355 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్ష పేపర్ల రీవాల్యుయేషన్‌కు ఆగస్టు 2వ తేదీలోగా రుసుం చెల్లించి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద రిజిస్టర్ చేసుకోవాలని వైస్ చాన్సలర్ ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు https/raylaseema university.ac.in లో చూడాలని వెల్లడించారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వినియోగదారులు ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 7382614308 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్'కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్స్ అండ్ వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డ్స్–2023కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి పీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళారంగం, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, వాణిజ్యం అండ్ పరిశ్రమలు, వైద్యం, సాహిత్యం అండ్ విద్య, సివిల్ సర్వీస్, క్రీడలు, ఇతరములే గాకుండా ఇతర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి/సేవలు చేసిన వారికి అలాగే పై రంగాల్లో గ్రామ/పట్టణ పేదరిక వాడల్లో సేవలు చేసి రాష్ట్రస్థాయిలో సత్కరించేందుకు అవకాశమున్నా గుర్తింపునకు నోచుకోని వారికి, రాజకీయ సంబంధం లేని స్వచ్ఛంద సేవ, లాభాపేక్షలేని సంస్థలు, చారిత్రక నేపథ్యం కలిగి కాలానుగుణంగా ఒడిదుడుకులు ఎదుర్కొని నిలిచిన సంస్థలు/సంఘాలకు వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్స్ అండ్ వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేయడానికి నిశ్చయించామన్నారు. అర్హులైన వారు ఆగస్టు ఒకటో తేది సాయంత్రం 5 గంటల్లోపు పై రంగాల్లో ప్రతిభ చూపిన/విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, సంస్థలు అండ్ సంఘాలు వారి పూర్తి వివరాలతో సంబంధిత ధ్రువపత్రాలు, ఫొటోలతో సెట్విన్–జిల్లా యువజన సంక్షేమ శాఖ, ఇండస్ట్రియల్ ఎస్టేట్, కర్నూలులో సమర్పించాలని సూచించారు.

పార్కుకు రూ.40 లక్షలు మంజూరు

నందికొట్కూరు: పట్టణంలోని ఏబీఎం పాలెంలో మున్సిపల్ పార్కు నిర్మాణం కోసం కర్నూలు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి రూ.40 లక్షల నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర శాప్ చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందన్నారు. ఏబీఎం పాలెంలో మున్సిపల్ పార్కు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన కుడా చైర్మన్‌కు, బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సిద్ధార్థరెడ్డి ప్రజలు రుణపడి ఉంటారన్నారు.



శిరివెళ్ల మండలం గోవిందపల్లెలో ఉన్నతి రుణాల వినియోగంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఉన్నతి రుణం స్వయం ఉపాధికి ఊతం

మహిళల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ మహిళలు స్వయం ఉపాధిలో రాణించేలా ప్రోత్సహిస్తోంది. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో 'ఉన్నతి' పథకం కింద వడ్డీలేని వ్యక్తిగత రుణాలను అందజేస్తోంది. వడ్డీ లేని రుణాలతో చిరు వ్యాపారాలను వృద్ధి చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


- మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం
- ఎస్సీ, ఎస్టీ పొదుపు గ్రూపు సభ్యులకు వడ్డీలేని రుణాలు
- ఈ ఏడాది నుంచి యూనిట్‌కు రూ.లక్ష వరకు రుణం పెంపు

ఆళ్లగడ్డ: స్వయం సహాయక గ్రూపుల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళా సభ్యులు ఆర్థికంగా నిలదొక్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వారికి రూ. కోట్లల్లో బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేస్తోంది. మరింత చేయూతనిచ్చే విధంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా వడ్డీ లేని 'ఉన్నతి' రుణాలు అందిస్తోంది. మహిళలు ఈ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ డెయిరీ, గొర్రెలు, మేకల పెంపకంతో పాటు చిరు వ్యాపారాల నుంచి చిన్న చిన్న కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. నంద్యాల జిల్లాలో మూడేళ్లలో 8,432 మంది ఎస్సీ, ఎస్టీ పొదుపు మహిళలు రూ.30.10 కోట్లు ఉన్నతి పథకం ద్వారా రుణాలు అందుకోగా ఈ ఏడాది 2,662 యూనిట్లకు గాను రూ. 12.36 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఫలితంగా 'ఉన్నతి' రుణాలతో స్వయం ఉపాధి పొందుతూ మరి కొంత మందికి ఉపాధి కల్పిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తునానరు. ఈ పథకం ద్వారా గతంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఒక్కో పొదుపు మహిళకు రూ.25 వేల నుంచి గరిష్ఠంగా రూ. 50 వేల వరకు మాత్రమే రుణం ఇచ్చేవారు. అయితే ఈ ఏడాది నుంచి ప్రభుత్వం రుణం మొత్తాన్ని రూ. లక్ష వరకు పెంచడంతో పాటు ఎటువంటి పూచి లేకుండా ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఉన్నతి రుణం పొందిన మహిళలకు ఉన్నతి సురక్ష బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. రుణం పొందిన సభ్యురాలు తీసుకున్న రుణానికి రూ. వెయ్యికి రూ. 4 ప్రీమియం చెల్లిస్తే ప్రమాద లేదా సహజ మరణం సంభవించినప్పుడు అప్పటి వరకు ఉన్న రుణం నిల్వను వారి కుటుంబ సభ్యులు చెల్లించే పనిలేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

జిల్లాలో నాలుగో విడత 'ఉన్నతి' రుణాల పంపిణీ ఇలా..

నియోజకవర్గం	యూనిట్లు	రుణం (రూ..ల్లో)
ఆళ్లగడ్డ	575	2,80,49,000
బనగానపల్లె	395	1,87,54,000
డోన్	412	1,85,87,000
నందికొట్కూరు	352	1,65,15,000
నంద్యాల	232	1,03,64,000
పాణ్యం	137	63,78,000
శ్రీశైలం	559	2,49,89,000
మొత్తం	2,662	12,36,36,000

అతివల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధించేలా చేయూత ఇవ్వడమే ఉన్నతి పథకం ముఖ్యోద్దేశం. వ్యాపార అవసరాలకు గ్రూపు సభ్యుల తీర్మానంతో దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉన్నతి పథకం కింద రూ. 10 వేల నుంచి రూ. లక్ష వరకు ఎటువంటి పూచీ లేకుండా వడ్డీ లేని రుణం తీసుకోవచ్చు. చిరు వ్యాపారాలు, చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలు, మేకలు, గొర్రెలు, డెయిరి, వ్యవసాయ, అనుబంధ పనులకు పెట్టుబడులు పెట్టుకోవచ్చు. అతివల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ఉన్నతి పథకాన్ని అమలు చేస్తోంది.

– శ్రీధర్‌రెడ్డి, పీడీ, డీఆర్డీఏ నంద్యాల

ఆర్థిక ఇబ్బందులు అధిగమించి..



ఇక్కడ మేకలతో ఉన్న ఈమె పేరు లలితమ్మ. ఆళ్లగడ్డ మండలం చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన ఈమె పద్మ పొదుపు గ్రూపులో సభ్యురాలు. వితంతురాలైన ఈమె కూలీకెళ్తేనే కడుపునిండేది. అటువంటి తరుణంలో పొదుపు సంఘం సభ్యులు అందరూ తీర్మానం చేసి ఈమెకు రూ.50 వేలు 'ఉన్నతి' రుణం ఇప్పించారు. ఆ డబ్బులతో 15 మేకలు కొనుగోలు చేసింది. వాటి నుంచి మరో 10 మేక పిల్లలు పుట్టగా వాటిని ఆరు నెలలు పెంచి పెద్ద చేసి ఒక్కొక్కటి రూ. 12 వేల నుంచి రూ. 18 వేల వరకు విక్రయించింది. దీంతో నెలకు రూ. 25 వేల వరకు ఆదాయం పొందింది. ఆర్థిక ఇబ్బందులు అధిగమించడంతో సక్రమంగా కంతులు చెల్లించింది.

వ్యాపారం ఇంతింతై..



ఇక్కడ ఎలక్ట్రిక్ వస్తువులు తయారు చేస్తున్న దంపతులు పరిమిళ, నరసింహులు. ఈమె ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె గ్రామానికి సరోజినిదేవి డ్వాక్రా సంఘంలో సభ్యురాలు. భర్త నంద్యాలలో ఓ ప్రైవేటు కంపెనీలో హీటింగ్ పర్నస్ యంత్రాలను తయారీ చేస్తుండేవాడు. అదే వస్తువులు ఇంటి దగ్గర భార్యతో కలిసి తయారు చేసి ప్రైవేటుగా విక్రయించేవారు. వీటిపై నైపుణ్యం తెలుసుకున్న పరిమిళ సొంతంగా తయారీకి ముందుకు వచ్చింది. ఉన్నతి రుణం కింద రూ.50 వేలు, బ్యాంకు రుణం రూ.80 వేలు మంజూరు కావడంతో మిట్టపల్లెలో కుటీర పరిశ్రమను ఏర్పాటు చేసింది. ఇప్పుడు వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ తన కుటుంబ సభ్యులతో పాటు మరో నలుగురు యువతకు ఉపాధి కల్పిస్తోంది.

వీరంతా అర్హులే..

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అందించనున్న ఉన్నతి పథకం రుణాలు సంఘం తీర్మానంతో ఒక్కో సభ్యురాలికి రూ. 25 వేల నుంచి రూ.లక్ష వరకు పొందవచ్చు. ఈ రుణానికి ఏ మాత్రం వడ్డీ ఉండదు. తీసుకున్న మొత్తానికి నెలవారి వాయిదాల రూపంలో చెల్లిస్తే సరిపోతుంది. కంతులు సక్రమంగా కట్టక మొండి బకాయిగా నిలిస్తే వారి నుంచి పావలా వడ్డీ వసూలు చేస్తారు. 18 నుంచి 60 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ పొదుపు మహిళలు ఈ రుణాలు పొందేందుకు అర్హులే. గతంలో బ్యాంకు లింకేజీ, చేయూత, ఆసరాలతో పాటు ఇతర రుణాలు తీసుకున్నా ఉన్నతి రుణాలు పొందవచ్చు.

పురాతన ఆలయానికి పూర్వ వైభవం



కొండపై ప్రాకారాన్ని భారీగా విస్తరించిన దృశ్యం



గర్భగుడికి మెరుగులు దిద్దిన దృశ్యం

- లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జీర్ణోద్ధరణ
- రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో శరవేగంగా పనులు

కొలిమిగుండ్ల: శ్రీకృష్ణదేవరాయల పాలనలో కొలిమిగుండ్ల కొండపై 750 అడుగుల ఎత్తులో నిర్మించిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి పూర్వ వైభవం రానుంది. కాలక్రమేణా శిథిలావస్థకు చేరిన ఆలయ అభివృద్ధిపై గతంలో దివంగత వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రబోతుల వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామ పెద్దలతో చర్చించారు. ఈ మేరకు సమీపంలోని రామ్‌కో సిమెంట్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన యాజమాన్యం రూ.7 కోట్లతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేసేందుకు ముందుకొచ్చింది. పురావస్తు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే కాటసాని పలుసార్లు చర్చించి ఆలయ పనులు చేపట్టేందుకు ఒప్పించారు. ఇప్పటికే స్వామి గర్భగుడి, మండపం పైకప్పును తొలగించి పటిష్ఠంగా నిర్మించారు. ఆలయం లోపల గ్రానైట్ రాళ్లతో ఫ్లోరింగ్ వేశారు. గతంలో ఉన్న ప్రాకారాన్ని తొలగించి పటిష్ఠంగా నిర్మించారు. ఆలయ ఆవరణను కుప్పం గ్రానైట్‌తో తీర్చిదిద్దుతున్నారు. గతంలో ఉన్న మూడంతస్తుల గాలిగోపురాన్ని కూలదోసి ఐదు అంతస్తుల గాలి గోపురం పనులు వేగంగా చేస్తున్నారు. రెండు కోనేర్ల అభివృద్ధి, 258 మెట్లను పూర్తిగా తీర్చిదిద్దనున్నారు. మరో ఎనిమిది నెలల్లో నిర్మాణ పనులు పూర్తయ్యేలా కనిపిస్తోంది. ఏటా వైశాఖ మాసంలో తొమ్మిది రోజుల పాటు స్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయం నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు బూడిదపాటి వంశస్తులే పూజారులుగా పని చేస్తున్నారు. ప్రస్తుతం రాఘవయ్య పూజారిగా స్వామి సేవలో తరిస్తున్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం నూతన శోభను సంతరించుకుంటుండటంతో భక్తుల్లో ఆధ్యాత్మిక ఆనందం కనిపిస్తోంది.

సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి

- అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి
- అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయండి
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అంజాద్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అంజాద్‌బాషా, చిత్రంలో కలెక్టర్ మనజీర్ జిలానీ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి బనగానపల్లె నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అంజాద్‌బాషా పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన మంగళవారం బనగానపల్లె నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని స్థానిక ధనలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి, ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, డీఆర్ఓ పుల్లయ్య, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, డోన్, నంద్యాల ఆర్డీఓలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అంజాద్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించి, పర్యవేక్షించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. ఈ మేరకు నంద్యాల జిల్లాలో మొట్టమొదట బనగానపల్లె నియోజకవర్గంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సమస్యల పరిష్కారానికి మంత్రి దిశానిర్దేశం చేశారు.

- హౌసింగ్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, జల వనరులు, ఆర్అండ్‌బీ, ఇళ్లపట్టాలు, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగ సంస్థలు, ఉపాధి హామీ, వైద్య ఆరోగ్యం, విద్య, స్త్రీ, శిశు సంక్షేమం తదితర శాఖల పురోభివృద్ధిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- ఇళ్లపట్టాలు, హౌసింగ్ నిర్మాణాలపై ఎమ్మెల్యే సూచించిన అంశాలను నోట్ చేసుకొని నిర్ణీత కాల వ్యవధిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.
- గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
- జగనన్న సురక్షలో మ్యూటేషన్ దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.
- వైఎస్సార్ జలయజ్ఞం కింద పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు విద్యుత్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ భూ సమస్యలన్నీ రెవెన్యూ రికార్డుల మేర అసైన్‌మెంట్ ద్వారా నిశితంగా పరిష్కరించి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సార్‌బీసీ పరిధిలో బోగస్ పట్టాలు మంజూరు చేసిన వాటిపై పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

సోలార్ డ్రైయర్స్‌తో ఆర్థిక తోడ్పాటు

అన్నదాతలతో పాటు పొదుపు మహిళలకు లబ్ధి

- జిల్లాలో 100 ఉల్లి, టమాట డ్రైయర్స్ ఏర్పాటు
- క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- 1000 మందితో ఆనియన్ పౌడర్ యూనిట్ స్థాపనకు చర్యలు



సోలార్ డ్రైయర్స్ యూనిట్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కర్నూలు(సెంట్రల్)/కల్లూరు: ఉల్లి, టమాట సోలార్ డ్రైయర్స్‌తో రైతులతో పాటు స్వయం సహాయక పొదుపు మహిళలకు ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలో ఏర్పాటు కానున్న 100 సోలార్ ఉల్లి, టమాట డ్రైయర్లను వర్చువల్‌గా ప్రారంభించారు. కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, అన్నదాతలు, పొదుపు మహిళలు హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తడకనపల్లెలోని స్వయం సహాయక సంఘాల మహిళలు సోలార్ డ్రైయర్స్ ఏర్పాటుకు ముందుకు రావడం సంతోషమన్నారు. ఏకంగా 100 యూనిట్ల స్థాపనకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నామన్నారు. సోలార్ డ్రైయర్స్‌ను ఉపయోగించి రోజుకు 200 కిలోల ఉల్లి లేదా టమాటాలను డీహైడ్రేషన్ చేసుకుంటే ఎన్ని రోజులైన కుళ్లిపోవన్నారు. ఈ ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకునేందుకు ఉంటుందన్నారు. ఇదే సమయంలో రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోతే సోలార్ డ్రైయర్స్ ద్వారా డీహైడ్రేడ్ చేసుకొని అమ్ముకుంటే కనీస మద్దతు ధర పొందవచ్చన్నారు. ఆదోని ఏరియాలో సోలార్ డ్రైయర్స్‌ను అధికంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. దేశంలో ప్రస్తుతం నాగ్‌పూర్‌లో మాత్రమే సోలార్ డ్రైయర్స్‌ను వినియోగిస్తున్నారని, ఆ తరువాత కర్నూలు జిల్లాలోనే పొదుపు మహిళల ద్వారా వీటి నిర్వహణ మొదలైందన్నారు. ఈ సంవత్సరం చివరి నాటికి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ద్వారా 5వేల యూనిట్ల స్థాపన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా 1000 మంది పొదుపు మహిళలతో ఆనియన్ పౌడర్ చేసే సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షహేరబీ, జెడ్పీటీసీ ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారాల్లో రాణించడం సంతోషకరం

తడకనపల్లె పొదుపులక్ష్మి గ్రూపు సభ్యులు బెల్లం, చెక్కర, పాలకోవా తయారీలో ఎంతో ఘనత సాధించారు. ఉల్లి, టమాట డ్రైయర్స్‌ను కూడా విజయవంతంగా నిర్వహించి ఉపాధి పొందుతుండటం శుభ పరిణామం. పొదుపు మహిళలు ఉపాధి కోసం స్థాపించే సోలార్ డ్రైయర్స్ కోసం బ్యాంకులు ముందుకొచ్చి రుణాలు ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. వైఎస్ఆర్ ఆసరా, చేయూత డబ్బుతో ఎంతో మంది పొదుపు మహిళలు వ్యాపారాల్లో రాణిస్తుండటం సంతోషకరం.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పాణ్యం శాసనసభ్యుడు

కూలి పనులను మించిన ఆదాయం



గత సంవత్సరం సెర్ప్ ద్వారా వెజిటబుల్ సోలార్ డ్రైయర్ ప్లాంటు నిర్వహణకు సంబంధించి శిక్షణ తీసుకున్నా. ఆ తర్వాత పది మందితో యూనిట్లు స్థాపించాం. నెలకు కనీసం రూ.18 వేల ఆదాయం వస్తోంది. మా గ్రామంలోని 63 పొదుపు గ్రూపుల్లో 630 మంది మహిళలు ఉన్నారు. వీరంతా సోలార్ డ్రైయర్స్ ఏర్పాటుకు ముందుకొస్తున్నారు. – సీఎం వైఎస్ జగన్‌తో వర్చువల్‌గా మాట్లాడుతున్న జుబేదాబీ

మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా సబిహా పర్వీన్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహా పర్వీన్‌ను ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆమెకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రశాంతంగా ఈట్ స్ట్రీట్ వేలాలు

కర్నూలు (టౌన్): నగరంలోని బిర్లా గేట్ ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేయనున్న ఈట్ స్ట్రీట్ (ఖనా ఖజానా)కు షాపుల వేలాలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఏడు షాపులకు (1 ప్లస్1) పెద్ద సంఖ్యలో వ్యాపారులు దరఖాస్తు చేసుకోగా లాటరీ పద్ధతిన కేటాయించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొని పారదర్శకంగా షాపులను కేటాయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వాసుల ఆహ్లాదం కోసం ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వీటి ద్వారా రెవెన్యూ విభాగానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కాగా చాట్ బండారు యూనిట్‌ను టి.వెంకటరమణమ్మ, సి.శరత్, పిజ్జా, బర్గర్ యూనిట్ మాటపతి కిషోర్ కుమార్, అంగడి రమీజా, ఐస్ పార్లర్ యూనిట్ తలంకి పవన్‌కుమార్, టి.తన్మయ్, బిర్యానీ యూనిట్ రేవలి లక్ష్మి, కటిక రెహమాన్, శాఖా ఫలహార శాల పసుపుల నవీన్, కోడుమూరు ధీరజ్, జ్యూస్ సెంటర్ యూనిట్ షేక్ అన్సర్ బాషా, పసుపుల భార్గవి, కాఫీ, టీ యూనిట్ షేక్ మహబూబ్ బాషా, చాకలి చంద్ర శేఖర్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: కల్లూరు మండలం ముజఫర్ నగర్‌లోని ఫారుక్ నగర్‌లో నివాసముంటున్న చింతరేవుల నరసింహులు(56) ఆత్మహత్య చేసుకున్నాడు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి ఈయన స్వగ్రామం. పదిహేనేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కర్నూలుకు వచ్చి ఫారుక్ నగర్‌లో నివాసముంటూ ఐస్ ఫ్యాక్టరీ నిర్వహణతో కుటుంబాన్ని పోషించేవాడు. కరోనా సమయంలో వ్యాపారం నడవక అప్పుల పాలయ్యాడు. దీనికి తోడు గుండెజబ్బు, షుగర్ తదితర వ్యాధులతో బాధ పడేవాడు. నెల రోజుల క్రితం ఇంట్లో మెట్లు దిగుతూ కాలు జారి కింద పడి కుడి కాలు బెణికింది. వైద్యం చేయించుకున్నప్పటికీ జబ్బు నయం కాకపోవడంతో పాటు కరోనా సమయంలో చేసిన అప్పులు తీర్చలేమోనని కుటుంబ సభ్యులతో బాధ పడేవాడు. మంగళవారం మధ్యాహ్నం భార్య జయమ్మ, కుమారుడు విజయ్ బ్యాంకు పనిమీదు బయటకు వెళ్లిన తర్వాత నరసింహులు తన గదిలోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.

‘టీ డే’లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కలెక్టరేట్ వద్దనున్న శ్యాలమ్మ సత్రం భవనంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ‘టీ డే’ స్టాల్‌లో మంగళవారం సాయంత్రం ఆహార నియంత్రణ విభాగం(ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు) అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ తయారయ్యే టీపై ఆహార నియంత్రణ విభాగానికి ఇటీవల ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మానాయకులు, కర్నూలు డివిజన్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఎస్.రాముడు, సూపరింటెండెంట్ అన్వర్‌బేగ్‌లు తనిఖీలు చేపట్టారు. టీ దుకాణంలో విక్రయిస్తున్న టీతో పాటు వినియోగిస్తున్న టీ పొడి శాంపిల్స్ తీసుకొని పంచనామా రాశారు. టీ దుకాణానికి అనుమతులపైనా ప్రశ్నించారు. భవనంలోకి ఏర్పాటు చేసిన దారిలో టీ స్టాల్ ఎలా ఏర్పాటు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా వ్యాపారం ఎలా చేస్తారని మండిపడ్డారు.

ఇంటింటా ఆరోగ్య పలకరింపు

- జ్వర పీడితుల కోసం వైద్యసిబ్బంది వాకబు
- జిల్లాలో 7,23,087 ఇళ్లు
- ఇప్పటివరకు 4,03,317 ఇళ్లల్లో సర్వే పూర్తి
- 978 మందికి జ్వర లక్షణాలు
- ఆసుపత్రికి తరలించి చికిత్స

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది. సమాజంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి వాకబు చేస్తోంది. అస్వస్థతులకు చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటోంది.


ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): వర్షాకాలం ప్రారంభమై వాతావరణం చల్లగా మారడంతో పలువురికి జ్వర లక్షణాలు కనిపిస్తున్నాయి. అవి సాధారణ జ్వరాలా లేదా డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలా గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటా సర్వే నిర్వహిస్తోంది. జిల్లాలోని 26 మండలాల పరిధిలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 30 అర్బన్ హెల్త్ సెంటర్లు, 257 సబ్ సెంటర్లు , 672 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, ఏఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర్లు రోగులకు సేవలందిస్తున్నారు. ఏ ఒక్కరికి జ్వరం లక్షణాలున్నా వెంటనే పరీక్షలు నిర్వహించి చికిత్స చేస్తున్నారు.

నాలుగురోజుల్లో 55 శాతం సర్వే

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆయా సచివాలయాల పరిధిలో సేవలందించే వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. గత సోమవారం నుంచి ప్రారంభమైన సర్వేలో భాగంగా గురువారం నాటికి 55.75శాతం పూర్తయ్యింది. జిల్లాలో 7,23,087 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 4,03,137 ఇళ్లను సర్వే చేశారు. ఇందులో ఇప్పటి వరకు 978 మందికి జ్వర లక్షణాలున్నట్లు తేల్చారు.

జ్వరలక్షణాలు కనిపిస్తే పరీక్షలు

ఇంటింటి సర్వేలో భాగంగా ఎవ్వరికైనా జ్వరలక్షణాలు కనిపిస్తే వలంటీర్ తన యాప్‌లో సదరు వ్యక్తి పేరుపై టిక్ చేస్తారు. వెంటనే ఆ వివరాలు సంబంధిత ఏఎన్ఎం యాప్‌లో ప్రత్యక్షమవుతాయి. ఈ మేరకు సదరు ఏఎన్ఎం సంబంధిత వ్యక్తి ఇంటికి వెళ్లి ముందుగా మలేరియా పరీక్ష నిర్వహిస్తారు. ఇది 20 నిమిషాల్లోనే రిపోర్ట్ చూపిస్తుంది. అందులో నెగిటివ్(మలేరియా లేదు) అని వస్తే డెంగీ నిర్ధారణ కోసం ఆర్‌డీడీ కిట్‌తో పరీక్ష చేస్తారు. డెంగీ కూడా లేకపోతే సాధారణ జ్వరంగా పరిగణించి ఏఎన్ఎం మాత్రలు ఇస్తారు.

పాజిటివ్ వస్తే ఉచితంగా వైద్యం



మలేరియా, డెంగీ వ్యాధుల కోసం నిర్వహించిన పరీక్షల్లో సదరు వ్యక్తికి పాజిటివ్ వస్తే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఉచితంగా మందులు, చికిత్స అందిస్తారు. మలేరియాగా నిర్ధారణ అయితే మెడికల్ ఆఫీసర్‌కు ఏఎన్ఎం సమాచారమిస్తారు. మెడికల్ ఆఫీసర్ మలేరియా చికిత్స ప్రారంభిస్తారు. ఒకవేళ డెంగీగా వస్తే మళ్లీ కచ్చితమైన నిర్ధారణ కోసం రక్తసిరా తీసి కర్నూలు లేదా ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు పరీక్ష కోసం పంపిస్తారు. అక్కడి పరీక్షల్లో పాజిటివ్ వస్తే సదరు ఆసుపత్రులకు పంపి చికిత్స చేయిస్తాము.

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

దోమలు ప్రబలకుండా విస్తృత చర్యలు



జిల్లాలో గత సోమవారం నుంచి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో ఇప్పటి వరకు ఒక్క డెంగీ, మలేరియా కేసు నమోదు కాలేదు. అయినా కూడా దోమలు ప్రబలకుండా విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నాం. డెంగీ, మలేరియా ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఆ ఇంటి చుట్టుపక్కల 50 ఇళ్లలో యాంటిలార్వా ఆపరేషన్ నిర్వహిస్తున్నాం. సదరు ఇళ్ల ల్లో డెంగీ కారక దోమలు లేకుండా చేసేందుకు నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్నాం. ఆయా ఇళ్లలో దోమ ల మందును పిచికారీ చేయిస్తున్నాం. సీజన్‌తో సంబంధం లేకుండా ఇది నిరంతరంగా జరిగే ప్రక్రియ.

–నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- 13.5 తులాల బంగారు, కిలో వెండి, రూ.30 వేలు నగదు రికవరీ


దొంగల నుంచి రికవరీ చేసిన నగదు, నగలను మీడియా ముందు ప్రదర్శించి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీరాం

కర్నూలు: కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణం నీలిషికారి పేటకు చెందిన నీలి షికారి లౌజి, షికారి కేమల కర్నూలు మండలం పసుపుల గ్రామ శివారులోని యూబీఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. వారి వద్ద నుంచి రూ.8.60 లక్షలు విలువ చేసే 13.5 తులాల బంగారు, కిలో వెండి నగలు, రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీరాం, ఎస్ఐలు రామయ్య, మన్మథ విజయ్‌లతో కలసి మంగళవారం సాయంత్రం తాలూకా అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు ఇళ్లల్లోనూ, ఓర్వకల్లు, కర్నూలు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇళ్లల్లో వీరు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. వీరిపై గతంలో కూడా కర్నూలు ఫోర్త్ టౌన్, నందికొట్కూరు, బేతంచర్ల పోలీస్‌స్టేషన్‌లలో చోరీ కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. పక్కా ఆధారాలతో దొంగలను అరెస్టు చేసి వారి నుంచి సొమ్ములు రికవరీ చేసినందుకు క్రైం పార్టీ సిబ్బంది ఆచారి, రామకృష్ణ, మంజుకుమార్, రాంప్రసాద్, సుధీర్, రమేష్ తదితరులను సీఐ అభినందించారు.

టీబీ డ్యాంకు కొనసాగుతున్న భారీ వరద

లక్ష క్యూసెక్కులకు చేరువలో ఇన్‌ఫ్లో
- 40 టీఎంసీలకు పైగా చేరిన నీటి నిల్వ
- 28న ఎల్‌ఎల్‌సీ, హెచ్‌ఎల్‌సీకి నీటి విడుదల


తుంగభద్ర జలాశయంలో చేరిన వరద నీరు


హొళగుంద వద్ద సిద్ధమైన వరినారు

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట్ వద్దనున్న తుంగభద్ర జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. మంగళవారం ఉదయం 72,489 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో సాయంత్రం 95 వేలు, లక్ష క్యూసెక్కుల మధ్య కొనసాగింది. బుధవారం ఉదయానికి 40 టీఎంసీలకు పైగా నీరు చేరే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల్లో దాదాపు 14 టీఎంసీలకు పైగా నీరు డ్యాంలోకి వచ్చి చేరాయి. గతేడాది పోలిస్తే ఈ ఏడాది దాదాపు నెల రోజుల పాటు జలాశయానికి వరద మొదలు కాకపోవడంతో ఆందోళనలో ఉన్న ఇరు రాష్ట్రాల ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు గత ఐదు రోజులుగా రిజర్వాయర్‌లోకి అనూహ్యంగా ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో సంతోషం వ్యక్తమవుతోంది. ఇప్పటికే బోరు బావుల కింద సాగు చేసిన వరినారు కొనేందుకు పోటీ పడుతున్నారు. కాలువ కింద వరి సాగుకు సిద్ధమవుతున్నారు. ఇదిలాఉంటే ఈ నెల 28న తుంగభద్ర జలాశయం నుంచి ఆంధ్రకు వచ్చే దిగువ కాలువ(ఎల్లెల్సీ), ఎగువ కాలువ(హెచ్ఎల్‌సీ)కు నీటిని విడుదల చేయనున్నారు. జలాశయం ఎగువన ఉన్న మలెనాడు, అగొంబె, వర్నాడు, తీర్థనల్లి, శివమొగ్గ, చిక్కమంగళూరు తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో టీబీ డ్యాం వైపు భారీగా వరద నీరు వస్తోంది. త్వరలోనే డ్యాం నిండి క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని నదికి వదలే సూచనాలు కనిపిస్తున్నాయి.

నల్లమల ఘాట్‌లో లారీ, బస్సు ఢీ


నిలిచిపోయిన ట్రాఫిక్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం నల్లమల ఘాట్‌లో మంగళవారం ఉదయం లారీ, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం పులిచెరువుకు సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దోర్నాల వైపు నుంచి శ్రీశైలం వస్తున్న విజయవాడకు చెందిన ఆర్టీసీ బస్సు, శ్రీశైలం నుంచి దోర్నాల వైపు వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన చోటు ఇరు కు రోడ్డు కావడంతో సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా బాబ్జిగౌడ్

కర్నూలు కల్చరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా కన్వీనర్‌గా బాబ్జి గౌడ్, కర్నూలు విభాగ్ కన్వీనర్‌గా ఎర్రిస్వామి నియమితులయ్యారు. రాజమండ్రిలో జరిగిన ఏబీవీపీ సైద్ధాంతిక శిక్షణ తరగతుల్లో వారిని నియమించినట్లు జాతీయ కార్యవర్గ సభ్యులు నాగఫణి మంగళవారం వెల్లడించారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

నంద్యాల(న్యూటౌన్): ఇటీవల జరిగిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్‌లో 932 విద్యార్థుల్లో 407 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 43.67 శాతం పాస్ అయినట్లు ఆయన వివరించారు. అలాగే పదో తరగతిలో 658 మంది విద్యార్థుల్లో 283 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 43.01శాతం వచ్చినటుతెలిపారు. ఫలితాలను https://apopenschool.ap.gov.in నుంచి పొందవచ్చని డీఈఓ వివరించారు.

ప్రభుత్వాసుపత్రిలో ఫార్మసిస్ట్ మందుల వ్యాపారం

- రోగులకు హోమియోపతి మందులను విక్రయిస్తున్న వైనం


అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఫార్మసిస్టుపై విచారణ చేపట్టిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్, ఎస్ఐ

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఫార్మసిస్టు అబ్దుల్లా హోమియోపతి మందులను విక్రయిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. అర్బన్ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులకు ప్రభుత్వం సరఫరా చేసిన మందులను ఇవ్వకుండా డబ్బులు తీసుకుని హోమియోపతి మందులు విక్రయిస్తుండటంతో డాక్టర్ షైనీ ప్రియాంక పలు మార్లు హెచ్చరించినా మార్పు రాలేదు. దీంతో డాక్టర్‌తో పాటు ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిశోర్, ఎస్ఐ ఎన్వీ రమణ ఆసుపత్రికి చేరుకుని రికార్డులు పరిశీలించారు. మందుల పంపిణీ నిర్వహణ సరిగా లేకపోవడంతో పాటు హోమియోపతి మందులు విక్రయిస్తున్నట్లు తెలుసుకున్నారు. దీంతో ఫార్మసిస్ట్‌పై డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తునట్లు మున్సిపల్ చైర్మన్ తెలిపారు. 20 రోజుల క్రితం ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పంపిణీ చేసేందుకు నర్సులకు కాలం చెల్లిన మందులను ఫార్మసిస్ట్ ఇచ్చినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న చైర్మన్, కమిషనర్ ఫార్మసిస్ట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలం చెల్లిన మందుల వల్ల స్కూల్ పిల్లలకు ఏమైనా జరిగింటే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ ఆస్పత్రిలో హోమియోపతి మందుల వ్యాపారం ఎలా చేస్తావని మండిపడ్డారు.

ముచ్చుమర్రిలో నాటు బాంబుల కలకలం

- ఇంటి వాటర్ ట్యాంక్‌లో లభ్యమైన బాంబుల మూటలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇంటి యజమాని
- 22 బాంబులు ఉన్నట్లు పోలీసుల నిర్ధారణ


ఇంటి యజమాని బోయ మధును విచారిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున


నీటి ట్యాంక్‌లో లభ్యమైన నాటు బాంబులు

పగిడ్యాల: కొత్త ముచ్చుమర్రి గ్రామంలో నాటు బాంబులు కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన బోయ మధు అలియాస్ అల్లరి మధు ఇంటి ఆవరణలోని బాత్‌రూమ్‌పై ఏర్పాటు చేసుకున్న వాటర్ ట్యాంక్‌లో మంగళవారం 22 నాటు బాంబులు బయటపడడం తీవ్ర చర్చనీయాంశమైంది. నీటి ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు వెళ్లిన మధు బాంబు మూటలను గుర్తించి వెంటనే ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జునకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ, నందికొట్కూరు అర్బన్ సీఐ విజయ్‌కుమార్‌తో ఘటన స్థలానికి చేరి నాటు బాంబుల మూటలను స్వాధీనం చేసుకుని నీటి బకెట్‌లో భద్రపరిచారు. నల్లగా మారిన బాంబులను పరిశీలిస్తే దాదాపు ఏడాది క్రితమే ట్యాంక్‌లో నిల్వ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఆ మూటల్లో బోయ మద్దిలేటి, బోయ మధు అని పేర్లు రాసి వారి ఫోన్ నంబర్లు, అమౌంట్‌కు సంబంధించిన వివరాలతో చీటి కూడా లభ్యమైందని చెబుతున్నారు. స్నానం చేసిన తమ పిల్లల శరీరంపై దద్దుర్లు వస్తుండడం గమనించి ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు వెళ్లగా మూటలు కనిపించాయని, వాటిని కిందకు తీసి విప్పగా నాటు బాంబులు ఉన్నాయని ఇంటి యజమాని పోలీసులకు వివరించారు. బోయ మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారం ఆశ చూపి.. నిలువు దోపిడీ

- తక్కువ ధరకు బంగారం ఇస్తామంటూ మోసం
- జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో కర్ణాటక ముఠా బాధితులు
- రూ.6.50 లక్షలు పోగొట్టుకున్న బూజునూరు వాసి లక్ష్మీదేవి
- న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన వైనం


కర్ణాటక ముఠా అంటగట్టిన నకిలీ బంగారు పూసల దండను చూపుతున్న బాధితులు

గడివేముల: ఎవరికీ అనుమానం రాకుండా అమాయకులకు ఎర వేయడం.. సొంత మనుషుల కంటే ఎక్కువ ఆప్యాయత చూపిస్తున్నట్లు నమ్మించడం.. ఆ తర్వాత బంగారం ఆశ చూపి ఉన్నదంతా దోచుకుని ఉసూరుమనిపించడం.. కర్ణాటక ముఠా తీరు ఇది. అతి తక్కువ ధరకు కేజీలలో బంగారాన్ని ఇస్తామంటూ బాధితుల్నే కర్ణాటకకు పిలిపించుకుని మరీ సర్వం స్వాహా చేసి పంపుతున్న వీరి ఆగడాలు వెలుగులోకి వస్తున్నాయి. నంద్యాల జిల్లాలో వెలుగోడు, గడివేముల, నంద్యాలతో పాటు పలు ఇతర ప్రాంతాల్లో సైతం పదుల సంఖ్యలో మోసపోయి లబోదిబోమంటూ విలపిస్తున్నారు. గడివేముల మండలం బూజునూరుకు చెందిన ఓ బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

అసలు బంగారంతో నమ్మించి..

బూజునూరుకు చెందిన చిక్కొండ లక్ష్మీదేవి గ్రామంలో చిన్న హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. కుమారుడు నరసింహ గొర్రెలు కాస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. వీరిది దిగువ మధ్య తరగతి కుటుంబం. ఉన్నదాంట్లో సంతోషంగా జీవిస్తున్న వీరి జీవితంలోకి పసిడి ఆశలు చూపుతూ 20 రోజుల క్రితం ముగ్గురు కేటుగాళ్లు వచ్చారు. హోటల్‌లో టిఫిన్ చేస్తూ, తమ వద్ద కౌజు పిట్టలు ఉన్నాయని తక్కువ ధరకు ఇస్తామంటూ మాటలు కలిపారు. ప్రస్తుతం అన్నీ అమ్మేశామని, మళ్లీ కౌజు పిట్టలు దొరికినప్పుడు ఫోన్ చేస్తామంటూ నరసింహ ఫోన్ నంబరు తీసుకున్నారు. రెండు రోజుల అనంతరం కేటుగాళ్లు ఫోన్ చేసి తమ పొలంలో గుప్త నిధులు బయటపడ్డాయని, 3 కిలోల బంగారం అమ్ముతామంటూ నమ్మబలికారు. కేజీ రూ.8 లక్షలకు ఇస్తామని ఆశలు రేపారు. అనుమానం ఉంటే రాయచోటికి వచ్చి బంగారు వ్యాపారుల దగ్గర పరీక్ష చేయించుకోవాలని సలహా ఇచ్చారు. వారు చెప్పినట్లుగానే అక్కడకు వెళ్లిన బాధితులకు అసలైన రెండు బంగారు పూసలు ఇచ్చి ప్రణాళిక ప్రకారం వారిని నమ్మించారు.

నకిలీ బంగారం అంటగట్టి..

కాస్త వ్యవధినిచ్చి తిరిగి ఫోన్ చేసి బేరం కుదుర్చుకున్నారు. డబ్బు తీసుకుని కర్ణాటకలోని చిక్‌బల్లాపూర్ జిల్లా చింతామణి క్రాస్ వద్దకు రావాలని చెప్పారు. అప్పటికే వారి వలలో చిక్కిన బాధితులు వారి వద్ద అంత డబ్బు లేకపోవటంతో బంధువులు, స్నేహితుల వద్ద అధిక వడ్డీలకు అప్పు తెచ్చి సొమ్ము సిద్ధం చేసుకున్నారు. వారం రోజుల తర్వాత కేటుగాళ్లు చెప్పిన ప్రాంతానికి వెళ్లి డబ్బు ఇచ్చిన ఈ అమాయకులకు వారు నకిలీ బంగారం మూటను అంటగట్టి, ఇంటికెళ్లి చూసుకోవాలంటూ అక్కణ్నుంచి ఉడాయించారు. ఎంతో ఆశగా ఇంటికి చేరుకున్న లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు నకిలీ బంగారం అని తెలుసుకుని కంగుతిన్నారు. దీంతో కేటుగాళ్లకు ఫోన్ చేస్తే అప్పటికే ముందస్తు ప్రణాళికలో ఉన్న వారు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. ఏం చేయాలో పాలుపోక, విషయం బయటికి చెప్పుకోలేక మదనపడుతూ రెండు రోజులు ఊరు వదిలి వెళ్లిపోయారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా...ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనని, అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని వెల్లడించారు. గడివేముల మండల కేంద్రంలోని పలువురు సైతం కేటుగాళ్ల చేతిలో రూ. లక్షల్లో మోసపోయినట్లు తెలుస్తోంది. వెలుగోడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు కర్ణాటక ముఠా చేతిలో మోసపోయి ఇల్లు, ఆటో అమ్ముకుని నిలువు దోపిడీకి గురైనట్లు సమాచారం.